క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

రహమత్‌నగర్: అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్, రీసెర్చ్ ఆధ్వర్యంలో ఆదివారం వినాయకనగర్ కమ్యూనిటీ హాల్లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో సాధారణ, ప్రసూతి, ఎముకల వైద్య సేవలు అందిస్తామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు టీహోప్ వార్షికోత్సవం

రహమత్‌నగర్: టీహోప్ స్వచ్ఛంద సంస్థ 3వ వార్షికోత్సవాన్ని ఆదివారం యూసుఫ్‌గూడలోని మహమూద్ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తామని సంస్థ వ్యవస్థాపకుడు కె.ఉపేందర్ రెడ్డి తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ నియోజక వర్గంలోని పేద ఆడపడుచుల వివాహాలకు ఆరు కానుకల పంపిణీ, మహిళ ఉపాధి కోసం కంప్యూటర్‌లో శిక్షణ వంటివి ఇప్పిస్తున్నామన్నారు.ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి వార్షికోత్సవ వేడుకలు జరుగుతాయన్నారు.

కాఫీషాప్‌పై కేసు

బంజారాహిల్స్: హైకోర్టు ఉత్తర్వులు ఉల్లంఘిస్తూ భారీ శబ్దాలతో డీజే ఏర్పాటు చేసి ఇతరులకు ఇబ్బంది కలిగిస్తున్న జూబ్లీహిల్స్‌లోని హార్ట్‌కప్ కాఫీ షాప్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. రాత్రి 10.15 గంటల తర్వాత కూడా భారీ మ్యూజిక్‌తో ఇక్కడ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తనిఖీలకు వెళ్లిన కానిస్టేబుల్ ఫిర్యాదు చేశాడు. దీంతో హార్ట్‌కప్ యజమాని శరత్‌బాబు, మేనేజర్ రాజేష్‌రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

'వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి'

రహమత్‌నగర్: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. వర్గీకరణ సాధనలో భాగంగా నిర్వహిస్తున్న పాదయాత్ర శుక్రవారం రాత్రి రహమత్‌నగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక కూడలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ జూబ్లీహిల్స్ ఇన్‌చార్జ్ రామకృష్ణ మాదిగ మాట్లాడుతూ, అధికారంలో వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఇచ్చిన మాటను కేంద్రం తప్పిందని ఆరోపించారు. ఎస్సీవర్గీకరణ జరిగే వరకు తమ పోరాటం కొనసాగిస్తామన్నారు. ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ సెక్రటరీ సుమో రాజు, నాయకులు పల్లె నర్సింగ్, అరుణ్, నరసింహ, మహేష్, పరుశరాం, జగన్, భవాని రాజు, రేణుక, సునీత, లత పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ దరఖాస్తు గడువు పెంపుపై హర్షం

బంజారాహిల్స్: జీఓ 58, 59 కింద స్థలాల క్రమబద్ధీకరణ దరఖాస్తు గడువును ప్రభుత్వం మరో నెల రోజుల పాటు పొడిగించడంతో పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ 1 నుంచి 30 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో షేక్‌పేట మండల పరిధిలోని బస్తీవాసులకు మరింత ప్రయోజనం చేకూరనుంది. క్రమబద్ధీకరణ వర్తించే కటాఫ్ తేదీని కూడా ప్రభుత్వం పొడిగించింది. కటాఫ్ తేదీని 2014 జూన్ 2 నుంచి 2020 జూన్ 5 వరకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల కేబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ తాజా మార్పులు జరిగాయి. ఫలితంగా ఫిలింనగర్ 18 బస్తీలతో పాటు పలు బస్తీల్లో సుమారుగా 10 వేల మంది పేదలకు ఈ అవకాశం వరంగా మారనుంది. ఇప్పటికే చాలా మంది ఈ రెండు జీఓల కింద దరఖాస్తు చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. తాజా నిర్ణయంతో ఇంకా చాలా మందికి అవకాశం కలిగే వెసులుబాటు కల్పించారు.

త్వరలో ప్రజాకాంగ్రెస్ పార్టీ ప్రజాదర్శన యాత్ర



మాట్లాడుతున్న కేబీ శ్రీధర్

లిబర్టీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించడానికి, ప్రజాసమస్యలు తెలుసుకోవడానికి ప్రజాదర్శన యాత్ర నిర్వహిస్తున్నట్లు ఇండియన్ ప్రజా కాంగ్రెస్ (ఐపీసీ) పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ తెలిపారు. శనివారం లిబర్టీ ప్లాజాలోని పార్టీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు సారథ్యంలో త్వరలో ప్రారంభమయ్యే ఈ యాత్ర కోసం రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామన్నారు. తెలంగాణలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించే యాత్రలో తమ పార్టీ పంచ సూత్రాలను ప్రజలకు వివరిస్తామన్నారు. భావసారూప్యత కలిగిన పార్టీలతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని శ్రీధర్ స్పష్టం చేశారు. కార్యాలయ కార్యదర్శి నందికొండల రావు తదితరులు పాల్గొన్నారు.

ఎప్పుడు పూర్తయ్యేనో?

పంజగుట్ట, సోమాజిగూడ చౌరస్తాల సుందరీకరణ పనుల్లో తీవ్రజాప్యం

- నిధులున్నా.. 40 శాతం కూడా పూర్తికాని వైనం
- రెండు కూడళ్లలో నిలిచిపోతున్న ట్రాఫిక్
- రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్న వాహనదారులు



పంజగుట్ట జంక్షన్‌లో జరుగుతున్న సుందరీకరణ పనులు

బంజారాహిల్స్: నగరాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు ప్రధాన కూడళ్లను ఆధునిక డిజైన్లతో అభివృద్ధి చేయాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. ఇందులో భాగంగా జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధి కిందకు వచ్చే సోమాజిగూడ, పంజగుట్ట జంక్షన్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. అయితే, పనుల్లో జాప్యం కారణంగా ఈ చౌరస్తాల మీదుగా ప్రయాణం సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- సోమాజిగూడ, పంజగుట్ట జంక్షన్లకు అదనపు హంగులు జోడించి మరింత అందంగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించిన జీహెచ్‌ఎంసీ ఒక్కొక్క జంక్షన్‌కు రూ. 2 కోట్లు కేటాయించింది.
- టెండర్ ప్రక్రియ కూడా పూర్తి కాగా గతేడాది అక్టోబర్‌లో ఈ రెండు కూడళ్లలో అభివృద్ధి పనులు ప్రారంభించారు.
- అయితే పనులు నత్తనడకన సాగుతుండటంతో అసలే ట్రాఫిక్ రద్దీగా ఉండే ఈ రెండు జంక్షన్లలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- ఇప్పటి వరకు 40 శాతం పనులు కూడా పూర్తి కాకపోవడంతో ఇంకా ఎన్ని రోజులు ఈ అవస్థలు ఎదుర్కోవాలో అంతుపట్టడం లేదని వాహనదారులు వాపోతున్నారు.
- గతంలో విశాలమైన కూడళ్ల నిర్మించగా ఆ ప్రాంతంలో ఎలాంటి ట్రాఫిక్ ఆంక్షలు ఉండేవి కాదు. వెడల్పుగా ఉండటంతో వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగేవి.
- రోజు రోజుకూ వాహనాల సంఖ్య, జనాల రద్దీ, వాణిజ్య, వ్యాపార సముదాయాలు, ఆస్పత్రులు పెరగడంతో ఈ కూడళ్ల అభివృద్ధి తప్పనిసరిగా మారింది.
- ఈ రెండు చౌరస్తాల్లో గ్రీనరీ, వాటర్ ఫౌంటెయిన్లు, లైటింగ్, విభిన్న ఆకృతులు ఉండేలా డిజైన్లు రూపొందించారు.
- ప్రణాళికలు, డిజైన్లు బాగానే ఉన్నా.. మూడు నెలలుగా అరకొరగా పనులు సాగుతున్నాయి.
- ఈ రెండు జంక్షన్లలో లారీలు, టిప్పర్లు, జేసీబీలు, ఇతర భారీ యంత్ర పరికరాలను నిలుపుతుండటంతో సహజంగానే ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.
- కనీసం వేసవి కాలంలోనైనా పనులు ముమ్మరంగా జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు ఆ దిశలో ఎలాంటి సమీక్షలు నిర్వహించడం లేదని తెలిసింది.

రెండు, మూడు నెలల్లో పూర్తి చేస్తాం

సోమాజిగూడ, పంజగుట్ట కూడళ్ల అభివృద్ధి పనులు గతేడాది అక్టోబర్‌లో ప్రారంభమయ్యాయి. అయితే డిజైన్‌కు అనుకూలమైన మెటీరియల్ రావడంలో కొంత ఆలస్యమైంది. ఇటీవలే ఈ సామగ్రి రావడంతో ప్రస్తుతం పనుల్లో వేగం పుంజుకుంది. మరో రెండు, మూడు నెలల్లో పనులు పూర్తి చేస్తాం. జ్యువెల్ సిటీగా ఈ రెండు ప్రాంతాలు పేరొందడం వల్ల ఇక్కడి షాపులకు వచ్చే వారందరూ కూర్చునే విధంగా సీటింగ్ కూడా ఏర్పాటు చేయబోతున్నాం. పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లు నిర్మిస్తాం. జీబ్రా క్రాసింగ్‌లు ఉంటాయి. అర్బన్ బయోడైవర్సిటీ ఆధ్వర్యంలో పూల మొక్కలు, లాన్ ఏర్పాటు చేస్తాం.

– ఇందిరాభాయి, ఈఈ సర్కిల్–17

'లెస్ పెటిట్స్' స్టోర్ ప్రారంభం



ప్రారంభిస్తున్న అంజు పోద్దార్, పింకీరెడ్డి తదితరులు

బంజారాహిల్స్: పిల్లల లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్ అయిన లెస్ పెటిట్స్ బంజారాహిల్స్‌లో తన స్టోర్‌ను ప్రారంభించింది. హైదరాబాద్ నగరంలో మొట్ట మొదటిసారిగా తన బ్రాండ్‌ను విస్తరించే క్రమంలో నెలకొల్పిన ఈ షోరూంను ప్రముఖ రచయిత్రి అంజు పోద్దార్, ఔత్సాహిక ఆర్ట్ క్యూరేటర్ పింకీరెడ్డి ప్రారంభించారు. ఇందులో అంతర్జాతీయ బ్రాండ్లు అయిన వెర్సేస్, మోస్‌చీనో, డోల్స్ అండ్ గబ్బానా, ఫెండీ, నూనా తదితర పిల్లల ఉత్పత్తులను అందుబాటులో ఉంచారు.

ఇంజినీరింగ్ అధికారుల పనితీరుతో వాకర్లకు అవస్థలు



కేబీఆర్ పార్కు ముందు నిలిచిపోయిన వరద నీరు

వెంకటేశ్వరకాలనీ: జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ శాఖ అధికారుల నిర్లక్ష్య పనితీరు కారణంగా వర్షం వచ్చిన ప్రతిసారి కేబీఆర్ పార్కు వద్ద వాకర్లు, సందర్శకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షం వచ్చినప్పుడల్లా పార్కు ముందు వరద నీరు పెద్ద ఎత్తున నిలిచిపోతున్నది. వర్షం తగ్గినా కూడా నాలుగైదు రోజుల వరకు ఆ నీరు అక్కడే నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని వాకర్లు ఫిర్యాదు చేస్తున్నారు. గతంలో ఇక్కడ జంక్షన్ సుందరీకరణ పనుల్లో భాగంగా నూతన ఫుట్‌పాత్‌ను నిర్మించిన అధికారులు ఇక్కడ వరద నీరు వెళ్లే మార్గాన్ని మూసివేశారు. అప్పటి నుంచీ ఇప్పటి వరకు ఈ సమస్య పలుమార్లు వాకర్లు, సందర్శకులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

'ప్రైవేట్ సంస్థల్లోనూ రిజర్వేషన్లు కల్పించాలి'

పంజగుట్ట: ప్రైవేట్ పరిశ్రమలు, ఐటీ సంస్థలు, వ్యాపార, వాణిజ్య సముదాయాల్లోనూ ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని బడుగు రిజర్వేషన్ హక్కుల పోరాట సమితి (బీఆర్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు చింత భాస్కర్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాల వారు ఉన్నత స్థితికి చేరుకోవాలని అంబేడ్కర్ రిజర్వేషన్లు కల్పించారన్నారు. అయితే, ప్రస్తుత ప్రపంచీకరణలో ప్రభుత్వ రంగ సంస్థలన్నీ పోయి ప్రైవేట్ సంస్థలు విపరీతంగా పెరిగాయని, ప్రైవేట్‌లో రిజర్వేషన్లు లేక ఎస్సీ, ఎస్టీలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రైవేట్ సంస్థల్లో కూడా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మొదటగా తెలంగాణలో ప్రైవేట్ సంస్థల్లో రిజర్వేషన్లు ప్రవేశపెట్టి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలని భాస్కర్ మాదిగ కోరారు. సమావేశంలో సెక్రటరీ శ్యామ్, ఉపాధ్యక్షుడు సవురం కట్టయ్య, కాలకోట్ల ప్రభాకర్ పాల్గొన్నారు.



ద్విచక్రవాహనాలపై పడిన భారీ చెట్టు



చెట్టును తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

వర్షానికి కూలిన భారీ చెట్టు

ఖైరతాబాద్: శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి సచివాలయం ఓల్డ్ గేటు రోడ్డులో ఓ భారీ చెట్టు నేలకొరిగింది. అదే సమయంలో ఆ రోడ్డులో వెళ్తున్న ఇద్దరు వాహనదారులపై తృటిలో తప్పించుకున్నారు. ఈ ఘటనలో రెండు బైక్‌లు ధ్వంసమయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు క్రేన్ సాయంతో చెట్టును తొలగించారు. రోడ్డుపై చెట్టు కూలడంతో లక్డీకాపూల్ నుంచి తెలుగుతల్లి చౌరస్తా వైపు వెళ్లే రోడ్డులో భారీగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

లిబర్టీ: అగ్ని ప్రమాదాలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి కోరారు. గ్రేటర్ పరిధిలో వరుసగా అగ్ని ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రాణ, ధన నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తాజాగా స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన ప్రమాదంలో ఆరుగురు యువతీ యువకులు మరణించడం కలచివేసిందన్నారు. నల్లగుట్ట స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కూడా ప్రమాదం జరిగిందని ఆయన అన్నారు. నగరంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదాలు, మరణాల గురించి ఈ సందర్భంగా గుర్తు చేసిన కుమారస్వామి ప్రభుత్వం అగ్నిప్రమాదాల నివారణ పటిష్టమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నవ్య, సుభాష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం



స్థానికులకు టీడీపీ పథకాలను వివరిస్తున్న జీవీజీ నాయుడు

శ్రీనగర్‌కాలనీ: టీడీపీతోనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జీవీజీ నాయుడు అన్నారు. శనివారం ఎర్రగడ్డలో డివిజన్ అధ్యక్షుడు అసద్ అలీ ఆధ్వర్యంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించి టీడీపీ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ పరిశీలకుడు సామ భూపాల్‌రెడ్డి, సూర్యదేవర లత, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీజిత్‌రాజ్ సేవలు పార్టీ గుర్తు పెట్టుకుంటుంది: చింతల



శ్రీజిత్‌రాజ్‌ను అభినందిస్తున్న చింతల రాంచంద్రారెడ్డి, గౌతంరావు

రహమత్‌నగర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలక సేవలందించిన హైదరాబాద్ జిల్లా బీజేవైఎం కార్యవర్గ సభ్యుడు శ్రీజిత్‌రాజ్(కిట్టు)ను బీజేపీ నాయకులు శనివారం అభినందించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీజిత్‌రాజ్ బీజేపీ బలపర్చిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి గెలుపు కోసం విశేష కృషి చేశారని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేవైఎం నాయకులు ఇదే మాదిరిగా కష్టపడాలని కోరారు. శ్రీజిత్‌రాజ్ సేవలను పార్టీ గుర్తు పెట్టుకుంటుందన్నారు. జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ అట్లూరి రామకృష్ణ, జూబ్లీహిల్స్ ఇన్‌చార్జ్ కిలారి మనోహర్, కన్వీనర్ కుంభా లగంగరాజు, అధికార ప్రతినిధి కొలన్ సత్యనారాయణ, నాయకులు విజయ్, స్వప్న, కృష్ణవేణి, కల్పన కమార్ నాయక్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జల్సాలకు అలవాటుపడి గంజాయి విక్రయం

యువకుడి అరెస్టు

బంజారాహిల్స్: జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం గంజాయి విక్రయిస్తున్న యువకుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. పాతబస్తీలోని బహదూర్‌పురాకు చెందిన షేక్ మహ్మద్‌ఇబ్రహీమ్(23) ప్రైవేట్ ఉద్యోగి. వచ్చే జీతం జల్సాలకు సరిపోకపోవడంతో తన స్నేహితుడు సయ్యద్ హుస్సేన్‌తో కలిసి గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. వారిద్దరూ కలిసి జహీరాబాద్‌కు చెందిన మాణిక్ అనే వ్యక్తి వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో అవసరమయిన వారికి అందిస్తున్నారు.వీరిద్దరూ శుక్రవారం రాత్రి జూబ్లీహిల్స్ రోడ్ నం. 82లో ఇబ్రహీం, హుస్సేన్ అనుమానాస్పదంగా తిరుగుతుండా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసుల రాకను పసిగట్టిన హుస్సేన్ పారిపోగా, ఇబ్రహీంను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 1100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని శనివారం రిమాండ్‌కు తరలించారు.

రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన ఇద్దరిపై కేసు

బంజారాహిల్స్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన వ్యక్తులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. యూసుఫ్‌గూడ సమీపంలోని శ్రీకృష్ణానగర్ బి–బ్లాక్‌లో నివాసం ఉంటున్న పెద్దగొల్లోళ్ల గంగప్ప(21) స్విగ్గీస్ డెలివరీ బాయ్‌గా పని చేస్తుంటాడు. అదే ప్రాంతంలో నివాసం ఉండే బోయ జగదీష్(21)తో కలిసి కొంతకాలంగా రేషన్ బియ్యాన్ని కార్డుదారుల వద్ద నుంచి కేజీ రూ.10 చొప్పున కొనుగోలు చేసి అక్బర్ సలీమ్ అనే వ్యక్తికి కేజీ రూ.12 చొప్పున విక్రయిస్తున్నారు. వీరి వ్యవహారంపై శుక్రవారం రాత్రి పౌరసరఫరాల శాఖ సర్కిల్–7 ఇన్‌స్పెక్టర్ విక్రమ్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుల ఇంటిపై పోలీసులు దాడి చేసి 10.95 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగి డ్రైవింగ్ చేసిన పలువురికి జైలు

వీరిలో మూడుసార్లు పట్టుబడ్డ వ్యక్తికి 12 రోజుల శిక్ష

బంజారాహిల్స్: మద్యం తాగి వాహనం నడుపుతూ ఇప్పటికే రెండుసార్లు పోలీసులకు చిక్కిన ఓ వ్యక్తి ముచ్చటగా మూడోసారి పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతగాడికి న్యాయమూర్తి 12 రోజుల జైలు శిక్ష, రూ.3300 జరిమానా విధించారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసుల కథనం ప్రకారం... మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడుపుతూ డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులకు 12 మంది పట్టుబడగా, వీరందరినీ నాంపల్లిలోని 4వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. వీరిలో జిన్నారంకు చెందిన ఆంజనేయులు అనే వ్యక్తి తాగి వాహనం నడుపుతూ మూడోసారి పట్టుబడటంతో న్యాయమూర్తి ఇతడికి 12 రోజుల జైలుతో పాటు రూ. 3300 జరిమానా విధించారు. అలాగే, శ్రీకాకుళంకు చెందిన రవి శంకర్‌కు ఐదు రోజులు, వరంగల్‌కు చెందిన దండు అనిల్‌కు ఐదు రోజులు, రెండోసారి పట్టుబడ్డ కృష్ణాజిల్లాకు చెందిన బి.రాజీవ్‌కు నాలుగు రోజులు, పి.భాస్కర్‌కు ఐదు రోజుల జైలు శిక్ష విధించారు. నల్లగొండకు చెందిన ఎస్. నరేందర్ డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేశారు. కాగా, వీరందరికీ కలిపి మొత్తం రూ. 30 వేల జరిమానా విధించారు.

జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో..

జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 11 మంది పట్టుబడ్డారు. వీరిని నాంపల్లిలోని 4వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా నలుగురికి జైలు శిక్ష విధించారు. వీరిలో కింగ్‌కోఠికి చెందిన ముఖేష్‌కుమార్‌కు రెండు రోజులు, బంజారాహిల్స్‌కు చెందిన షేక్ అజార్‌కు రెండు రోజులు, కేపీహెచ్‌బీకి చెందిన బి.తిరుపతయ్యకు ఐదు రోజులు, యూసుఫ్‌గూడకు చెందిన బాలకృష్ణకు మూడు రోజులు జైలు శిక్ష విధించారు. అలాగే, ఒక్కొక్కరికి రూ. 2100 చొప్పున జరిమానా విధించారు. ఇక జవహర్‌నగర్‌కు చెందిన సయ్యద్ ముస్తాక్ డ్రైవింగ్ లైసెన్స్‌ను మూడు నెలల పాటు రద్దు చేయడమే కాకుండా రూ. 3300 జరిమానా విధించారు.

మైనారిటీలకు ఉచిత శిక్షణ

మాదాపూర్: మాదాపూర్‌లోని న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్)లో 10వ తరగతి, ఆ పై తరగతులు చదువుతున్న ముస్లిం మైనారిటీ అభ్యర్థులకు మెటీరియల్ టెస్టింగ్, క్వాలిటీ కంట్రోల్ కోర్స్‌లో 3 నెలలు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు న్యాక్ నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు సెల్: 8008063922, 8247496936లలో సంప్రదించాలన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

మియాపూర్: ప్రేమించిన అమ్మాయి మాట్లాడటం లేదని, తన నంబర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టిందని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ నాగేశ్వర్‌రావు వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా సదాశివపేట్ మండలం ఆరూర్ గ్రామానికి చెందిన చెల్మెడ అఖిల్(28) పటాన్‌చెరులోని శ్రీనగర్‌కాలనీలో ఉంటూ గచ్చిబౌలిలోని ఓ ఐటీ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ నెల 16న చందానగర్‌లోని ఓయో హోటల్‌లో ఓ గదిని అద్దెకు తీసుకొని ఉన్నాడు. మరుసటి రోజు ఎంతకూ అఖిల్ బయటకు రాకపోవడంతో యాజమాన్యం కిటికీలోంచి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకొని చనిపోయి ఉన్నాడు. అతడి మెయిల్‌లో ఓ సూసైడ్ నోట్‌ను గుర్తించారు. అందులో 'ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నానని.. గత కొన్ని రోజులుగా తనతో మాట్లాడకుండా తన ఫోన్‌ను బ్లాక్ లిస్టులో పెట్టిందని.. అందుకే సూసైడ్ చేసుకుంటున్నానని' రాసి ఉంది. మృతుడి సోదరుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాలు పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న మాధవరం కృష్ణారావు

సనత్‌నగర్: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు పేదలకు వరం లాంటిదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బేగంపేట డివిజన్‌కు చెందిన పలువురికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శనివారం ఆయన అందజేసి మాట్లాడారు. యావత్ దేశం ఆచరించేలా రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు పరుస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ఎజెండాగా పథకాలకు రూపొందిచారన్నారు. గతంలో నిరుపేదలు ఆడబిడ్డల పెళ్లి చేయాలంటే ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడేవారని, ప్రస్తుతం ప్రభుత్వం తరపున రూ. లక్ష ఆర్థిక సహాయం అందిస్తూ వారికి చేయూతగా నిలుస్తోందన్నారు. ఇలాంటి పథకం దేశంలో ఎక్కడ కూడా లేవన్నారు. సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం అభినందనీయం



హిమాయత్‌నగర్‌లోని క్లియర్ విజన్ ఆసుపత్రిలో బండి సంజయ్

హిమాయత్‌నగర్: పేదలకు ఉచితంగా కంటికి సంబంధించిన అన్ని వ్యాధులకు చికిత్స అందించడం అభినందనీయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ అన్నారు. హిమాయత్‌నగర్‌లోని క్లియర్ విజన్ ఐ ఆసుపత్రిలో గ్లకోమా అవగాహన సదస్సులో భాగంగా వారం రోజుల పాటు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని బండి సంజయ్ సందర్శించారు. శిబిరంలో డాక్టర్ ఎస్.నవీనా(ఐ సర్జన్) చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు.

సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

పంజగుట్ట: సైబర్ నేరాల విషయంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని విపణి గ్రూప్ సీఈఓ సుధాకర్ అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. గత ఎనిమిది సంవత్సరాలుగా తమ సంస్థ సుమారు 500 కంపెనీలతో బిజినెస్ టు బిజినెస్ చేస్తున్నామన్నారు. అయితే తమ సంస్థకు ఉన్న మంచిపేరును ఇటీవల కొంతమంది సైబర్ నేరగాళ్లు డబ్బు వసూలు చేస్తూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ విషయమై సైబర్ క్రైంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆకట్టుకుంటున్న సిల్క్ గ్యాలరీ



శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్య సాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటుచేసిన సంప్రదాయ, సమ్మర్ స్పెషల్ కలెక్షన్ ఎగ్జిబిషన్ మహిళలను అమితంగా ఆకట్టుకుంటోంది. ఈనెల 21 వరకు సుమారు 80స్టాల్స్‌లో ఎగ్జిబిషన్‌ను ప్రదర్శిస్తున్నారు. దేశంలోని ప్రముఖ చేనేతకళాకారులు తమ ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలు మగువల మనసుదోచుకుంటున్నాయి. చేనేత కళాకారులకు చేయూతను అందించడానికి ఈ ప్రదర్శనను ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్ కుమార్ తెలిపారు.

డ్రైవింగ్ లైసెన్స్‌లేని వాహనదారులకు జరిమానా

బంజారాహిల్స్: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా దూసుకుపోతున్న స్కూటరిస్టులకు నాంపల్లిలోని పదో ప్రత్యేక మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. జూబ్లీహిల్స్ ట్రాఫిక్‌పోలీసులు వేర్వేరు చోట్ల నిర్వహించిన తనిఖీల్లో 13 మంది ద్విచక్ర వాహనదారులు డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా చిక్కారు. వీరిపై కేసులు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం న్యాయస్థానంలో హాజరుపర్చారు. వీరందరికీ రూ.12100 జరిమానా విధించినట్లు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



రహమత్‌నగర్: బోరబండలోని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానం 15వ (పంచదశ) వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి హోమం, మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం పడిపూడి మహోత్సవం వైభవంగా నిర్వహించారు.ఆలయ ధర్మకర్త లక్ష్మణ్‌గౌడ్, కమిటీ సభ్యులు బాలక్రిష్ణ పాల్గొన్నారు.

బీజేపీ నేతల సంబరాలు



రహమత్‌నగర్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన ఏవీఎన్ రెడ్డి విజయం సాధించడంతో జూబ్లీహిల్స్ నియోజక వర్గం బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రహమత్‌నగర్ కూడలిలో శుక్రవారం విజయోత్సం నిర్వహించి మిఠాయిలు పంచారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ కన్వీనర్ కుంబాల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సక్రమంగా అందుతోందా..?

- రేషన్ షాపుల్లో కొనసాగుతున్న సోషల్ ఆడిట్
- కార్డుదారుల నుంచి సలహాలు స్వీకరించిన అధికారులు



భగత్‌సింగ్ కాలనీలోని రేషన్ షాపులో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న రేషనింగ్ అధికారులు...

బంజారాహిల్స్: రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ సక్రమంగా జరుగుతుందా.? లేదా..? అనే విషయాలు తెలుసుకునేందుకు ఖైరతాబాద్ సర్కిల్–7 రేషనింగ్ అధికారులు రేషన్ షాపుల్లో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నారు. ప్రతినెలా సర్కిల్ పరిధిలో పది శాతం రేషన్ షాపుల్లో ఈ సోషల్ ఆడిట్ నిర్వహించి సరుకుల కోసం వచ్చిన కార్డుదారుల నుంచి అభిప్రాయ సేకరణ చేపడతారు. వారిచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ప్రొఫార్మాలో నమోదుచేసి చీఫ్ రేషనింగ్ ఆఫీసర్‌కు పంపిస్తారు. ప్రతినెలా సర్కిల్ పరిధిలోని ఎనిమిది షాపుల్లో వారంలో రెండు చొప్పున రేషన్ షాపులను ఎంపిక చేసుకొని అక్కడ వినియోగదారులతో మాట్లాడి వారి సలహాలు, సూచనలు సేకరిస్తారు. రేషనింగ్ సర్కిల్–7 పరిధిలో మొత్తం 81 రేషన్ షాపులు ఉండగా ఇందులో 83,127 తెల్ల రేషన్ కార్డుదారులున్నారు. ఒక అన్నపూర్ణ కార్డు, 3,368 అంత్యోదయ, అన్నయోజన కార్డులు ఉన్నాయి. ఈ కార్డులన్నింటిలో కలిపి 2,85,267 మంది వినియోగదారులు ప్రతి నెలా రేషన్ సరుకులు తీసుకుంటున్నారు. సర్కిల్‌పరిధి కింద కువచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ప్రతినెలా జరిగే ఈ సోషల్ ఆడిట్‌లో ప్రజాప్రతినిధులతో పాటు బస్తీ, కాలనీ సంక్షేమ సంఘాల నేతలు పాల్గొంటూ రేషనింగ్ అధికారులకు తాము ఎదుర్కొంటున్న సమస్యలు తెలియజేయడంతో పాటు సూచనలు కూడా అందిస్తుంటారు. రేషన్ పంపిణీలో అవకతవకలకు ఆస్కారం లేకుండా చూడటానికే ఈ సోషల్ ఆడిట్ నిర్వహిస్తుంటారు. తమ రేషన్ షాపు వద్దకే రేషనింగ్ అధికారులు తనిఖీల కోసం వస్తుండటంతో వినియోగదారులు కూడా తమ ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్ళేందుకు ఆస్కారం ఏర్పడుతున్నది. రేషన్ డీలర్ నుంచి స్పందన సరిగ్గా లేకపోయినా, సమయానికి షాపు తెరవకపోయినా, సక్రమంగా రేషన్‌బియ్యం పంపిణీ చేయకపోయినా, వినియోగదారుల పాలిట సిబ్బంది దురుసుగా ప్రవర్తించినా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ఎంతో పారదర్శకంగా జరిగే ఈ సోషల్ ఆడిట్‌లో ప్రొఫార్మాలో రికార్డ్ చేసిన నివేదికను సీఆర్‌వోకు పంపించడం, అక్కడి నుంచి ప్రభుత్వానికి వెళ్ళడం జరుగుతున్నది.

సోషల్ ఆడిట్‌ను పరిశీలించిన కార్పొరేటర్...

జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని ఎమ్మార్సీ కాలనీ, భగత్ సింగ్ కాలనీలలో ఉన్న రేషన్ షాపు నెంబర్ 814, 768లలో శుక్రవారం జరిగిన సోషల్ ఆడిట్‌ను స్థానిక కార్పొరేటర్ వెంకటేష్ పరిశీలించారు. ఇక్కడికి వచ్చిన వినియోగదారుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. రేషన్ బియ్యం పంపిణీలో ఏవైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా అని అధికారుల ముందే ప్రశ్నించారు. బియ్యం పంపిణీలో అవకతవకలు లేకుండా చూసుకోవాలని అధికారులకు సూచనలు జారీ చేశారు. రేషన్ షాపుల్లో సోషల్ ఆడిట్ నిర్వహించడం వల్ల వినియోగదారుల సమస్యలు తెలుసుకోవడానికి వీలుంటుందని ఇదొక మంచి ప్రక్రియ అని ఆయన వెల్లడించారు. ఈ ఆడిట్‌లో రేషనింగ్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ కూడా పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో ఎమర్జెన్సీ గేట్ ఏర్పాటు



జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45 జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ ఐరన్ గేట్

బంజారాహిల్స్: అత్యవసర పరిస్థితుల్లో చుట్టూ తిరిగే వెళ్ళే అవసరం లేకుండా వాహనాలు నేరుగా ముందుకు వెళ్ళే విధంగా జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45 జంక్షన్‌లో ఎమర్జెన్సీ ఐరన్ గేట్‌ను జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేశారు. గత కొన్ని నెలల క్రితం ఈ జంక్షన్‌లో ట్రాఫిక్ మళ్ళింపులు చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే ముఖ్యమంత్రి, గవర్నర్, ఇతర వీవీఐపీల రాకపోకల సందర్భంగా ఈ బారికేడ్లను జరపడం, మళ్ళీ యదాతథ స్థితికి తీసుకురావడం ఇదంతా పెద్ద తతంగంగా మారిన నేపథ్యంలో పర్మినెంట్‌గా ఆధునిక హంగులతో జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు ఐరన్ గేట్‌ను ఏర్పాటు చేశారు. దీనికి తలుపులు ఏర్పాటు చేసి తాళం కూడా వేశారు. వీవీఐపీల రాకపోకల సందర్భంలో, హెల్త్ ఎమర్జెన్సీ సమయంలో గ్రీన్ ఛానెల్ కోసం, అత్యవసరంగా ఆస్పత్రులకు వెళ్ళే అంబులెన్స్‌ల కోసం తెరిచేందుకు వీలుగా వీటిని ఏర్పాటు చేశారు. ఇలాంటి ఐరన్ గేట్ కేవలం ప్రగతి భవన్, రాజ్‌భవన్ ముందు మాత్రమే ఉండగా తాజాగా జూబ్లీహిల్స్ బాలకృష్ణ ఇంటి చౌరస్తాలో ఏర్పాటు చేశారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న విజయారెడ్డి

బంజారాహిల్స్: చిరు వ్యాపారాలు చేసుకుంటూ ఉపాధి పొందుతున్న పేదలపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారనే ఫిర్యాదులతో పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ సర్కిల్–17 టౌన్‌ప్లానింగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా శుక్రవారం పంజగుట్ట నుంచి సోమాజిగూడ యశోదా ఆస్పత్రికి వెళ్ళే రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించారు. పంజగుట్ట ప్రధాన రహదారి నుంచి యశోదా ఆస్పత్రి వరకు రోడ్డుకు రెండువైపులా పెద్ద ఎత్తున డబ్బాలు, తోపుడు బండ్లను, షాపుల ముందు నిర్మించిన షెడ్లను తొలగించారు. దీంతో పోలీసులకు, చిరు వ్యాపారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. మూడుగంటల పాటు జరిగిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో పెద్ద సంఖ్యలో ఆక్రమణలు తొలగించినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా సమస్య తెలుసుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి వచ్చి అధికారులపై తీవ్ర ఆగ్రహంవ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయరహదారిపై బైఠాయించారు.

'మహిళా బిల్లును అడ్డుకుంటున్నది ఎవరో అర్థం కావడం లేదు'

పంజగుట్ట: నాటి ఇందిరాగాంధీ మొదలు, ప్రస్తుతం కవిత వరకు అందరూ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటున్నారని, కాని అమలు కాకుండా అడ్డుకుంటున్నది ఎవరో అర్థం కావడంలేదని బహుజన రాజ్యం పార్టీ పూలే అంబేడ్కర్ జాతీయ అధ్యక్షులు లాలు నాయక్ రమావత్ ప్రశ్నించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రజా పరిరక్షణ రాజకీయ వేదిక / తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో సుమారు 30 పార్టీలు కలిసి చట్టసభల్లో మహిళలకు 33 శాతం, బీసీ లకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మన తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షులు పి.అశోక్, రైతు రాజ్యం పార్టీ అధ్యక్షులు ఎమ్.బి.బాలకృష్ణ, సమైఖ్యాంధ్ర పరిరక్షణ సమితి పార్టీ అధ్యక్షులు కుమార్ చౌదరీ యాదవ్‌లతో కలిసి మాట్లాడుతూ .. మహిళలకు 33 శాతం, బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఇప్పటికే అన్ని పార్టీలు కలిసి ఎన్నో పోరాటాలు చేశామని, అన్ని ప్రధాన రాజకీయపార్టీలకు వినతులు ఇచ్చామని అయినా స్పందన లేదన్నారు.

ప్రాచీన కళలకు ప్రాధాన్యత ఇవ్వాలి



కార్యక్రమంలో పాల్గొన్న సాలర్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ ఎ.నాగేందర్‌రెడ్డి

హిమాయత్‌నగర్: ప్రాచీన కళలను ప్రోత్సహించి, వాటికి మరింత ప్రాధాన్యతను ఇస్తూ వాటి ఉనికిని కోల్పోకుండా అందరూ కృషి చేయాలని సాలర్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ ఎ.నాగేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్లో 'హ్యాండ్ షాడో పప్పెట్రీ' ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్, స్ఫూర్తి థియేటర్ సంయుక్తంగా 7రోజుల పాటు పప్పెట్‌షోను నిర్వహించారు. ముగింపు సందర్భంగా పలు ప్రదర్శనలు నిర్వహించడంతో విద్యార్థులు తిలకించి మంత్రముగ్ధులయ్యారు.

రుణం ఎగ్గొట్టిన ఇద్దరిపై కేసు నమోదు

ఈఎంఐలు కట్టకుండా పరారవ్వడంతో కేసు నమోదు

హిమాయత్‌నగర్: వాహనం కోసం ఓ ఫైనాన్స్ కంపెనీ నుంచి రుణం తీసుకున్న ఇద్దరు వ్యక్తులు ఆ లోనును చెల్లించకుండా పరారయ్యారు. పలు మార్లు ఇంటి అడ్రస్‌ను ఫైనాన్స్ కంపెనీ చెక్ చేయగా వారు కనిపించకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. దీంతో నారాయణగూడ పోలీసులకు నాంపల్లి 9వ మెట్రోపాలిటియన్ కోర్టు ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలంటూ సూచించింది. వివరాలిలా ఉన్నాయి.. ఓల్డ్ మలక్‌పేటకు చెందిన మహ్మద్ జంహంగీర్, సయ్యద్ సముద్దీన్ ఖలీల్‌లు వెహికల్ లోన్ కోసం చెన్నైకు చెందిన శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌ను 2019లో ఆశ్రయించారు. హిమాయత్‌నగర్ స్ట్రీట్–6లో ఉన్న ఫైనాన్స్ కార్యాలయానికి వెళ్లి డాక్యుమెంట్స్ సబ్మిట్ చేయడంతో రూ.32.20లక్షల లోన్ ఆ ఇద్దరికీ మంజూరైంది. ఆ మొత్తానికి 63 నెలల పాటు ప్రతి నెలా ఈఎంఐ చెల్లించాల్సి ఉండగా..కొన్ని నెలలు చెల్లించి ఆ తర్వాత చెల్లించకుండా ఆపేశారు. దీనిపై ఆ ఇద్దరి ఇళ్లకు ఫైనాన్స్ కంపెనీ పలు మార్లు నోటీసులు జారీ చేసింది. నోటీసులకు జవాబు ఇవ్వకపోవడంతో ఫీల్డ్ ఆఫీసర్లుఇంటివద్దకు వెళ్లి తనిఖీలు చేయగా..వారిచ్చిన అడ్రస్‌లు తప్పుగా నిర్ధారించారు.

దీంతో తమ ఫైనాన్స్ కంపెనీని మోసం చేసిన వారిని శిక్షించాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. కోర్టు సూచనల మేరకు నారాయణగూడ పోలీసులు ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమాజాభివృద్ధిలో మాతృభాష కీలకం



సదస్సులో పాల్గొన్న అజీజ్ బానో తదితరులు..

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కళల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన భాషా సాహిత్య ఫోరమ్‌లో భాగంగా మాతృభాషా ఉర్దూ ప్రాముఖ్యత అనే అంశంపై శుక్రవారం వెబినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మౌలానా అజాద్ జాతీయ ఉర్దూవిశ్వవిద్యాలయం కళాశాల డీన్ ప్రొ. అజీజ్ బానో ముఖ్య అతిథిగా పాల్గొని మాతృభాష–ఉర్దూ ప్రాముఖ్యత అనే అంశంపై కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ సమాజాభివృద్ధిలో మాతృభాష ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. భారత ఉపఖండంలో సంక్లిష్ట సాహితీ చరిత్రలో ఉర్దూ గొప్ప సాంప్రదాయ భాష అని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి కే. సీతారామారావు, రిజిస్ట్రార్ డా.ఏవీఎన్.రెడ్డి, డా.షకీలా ఖానం, డా. సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

చోరీ చేసిన ఆటోతో చిక్కిన దొంగ

బంజారాహిల్స్: దొంగిలించిన ఆటోలో తిరుగుతూ ఓ వ్యక్తి పట్టుబడ్డాడు.ఈ ఘటన జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీధర్ శుక్రవారం ఉదయం నీరూస్ చౌరస్తాలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా టీఎస్ 34 టీ 5868 నెంబర్ ఆటోను ఆపి పత్రాలు పరిశీలించాడు. అయితే సరైన పత్రాలు చూపించకుండా పొంతనలేని సమాధానాలు చెప్పడమే కాకుండా సదరు ఆటో డ్రైవర్ ఆటోను వదిలేసి తప్పించుకునేందుకు యత్నించాడు. గమనించిన ట్రాఫిక్ ఎస్ఐ ఆరా తీయగా సదరు ఆటో డ్రైవర్ మాదావత్‌సురేష్(23) కూకట్‌పల్లి ప్రగతి నగర్‌లో నివాసం ఉంటాడని, 2019 నవంబర్ 9న కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆటోను దొంగిలించినట్లు తేలింది. కేపీహెచ్‌బీ పీఎస్‌లో మేరకు ఐపీసీ 379 కింద చోరీ కేసు నమోదు అయినట్లు తేలింది. దీంతో ఈ విషయాన్ని గురించి సంబంధిత పోలీసులకు ట్రాఫిక్ ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. కేపీహెచ్‌బీ పోలీసులు ఎఫ్ఐఆర్ కాపీతో జూబ్లీహిల్స్‌ట్రాఫిక్ పోలీసులను సంప్రదించి ఆటోతో పాటు నిందితుడిని అదుపులోకి తీసుకువెళ్లాడు. మొత్తానికి నాలుగేళ్లుగా చోరీ చేసిన ఆటోను పోలీసుల కళ్లుగప్పి తిప్పుతూ ఇన్నాళ్లకు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులకు చిక్కాడు.

ఆక్రమణ గురించి ప్రశ్నించినందుకు దాడి

బంజారాహిల్స్: పబ్లిక్ రోడ్డును ఆక్రమించి ఇంటికి మెట్లు నిర్మించడం నిబంధనలకు విరుద్ధమని ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ నేతపై దాడికి దిగిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని శ్రీరాంనగర్‌లో మహ్మద్ అబ్దుల్ రహీం అనే వ్యక్తి పబ్లిక్ రోడ్డును ఆక్రమించి నూతనంగా నిర్మిస్తున్న తన ఇంటికి మెట్ల నిర్మాణం చేపట్టాడు. స్థానిక బీఆర్ఎస్ నేత మహ్మద్ అతర్ ఇదే విషయాన్ని సదరు ఇంటి యజమానిని ప్రశ్నించాడు. ఆగ్రహం వ్యక్తం చేసిన రహీం అక్కడే ఉన్న కర్రతో తనను ప్రశ్నించిన వ్యక్తిపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో అతర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బెదిరించడమే కాకుండా తనపై దాడి చేసి తీవ్రంగా కొట్టి గాయపరిచిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు రహీంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మురుగు.. పరుగు..



పంజగుట్ట ప్రధాన దారిలో పొంగుతున్న మురుగు

బంజారాహిల్స్: అకాల వర్షానికి ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లలో ఉన్న మ్యాన్‌హోళ్లు పొంగుతూ మురుగంతా రోడ్లపై ప్రవహిస్తోంది. పంజగుట్ట ప్రధాన రహదారిలో విజయ డయాగ్నస్టిక్స్ వద్ద, నిమ్స్ ప్రధాన గేటు వద్ద పెద్ద ఎత్తున వరద నీరు, మురుగు నీరు నిలవడంతో ఆస్పత్రికి వచ్చిపోయే వారితో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు దారిలో కూడా పెద్ద ఎత్తున వరద నీరు నిలిచిపోయింది. వరద నీరు వెళ్ళే మార్గాలు మూసుకుపోవడంతో నీరు రోడ్లపైనే తిష్టవేసింది. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శలు వినిపించాయి.

యువతితో అసభ్య ప్రవర్తన

బంజారాహిల్స్: మాట్లాడదామని ఇంటికి పిలిచి ఓ యువతిని గదిలో బంధించి దుస్తులు తొలగించి అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా ఇష్టానుసారంగా దాడి చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. అమీర్‌పేట్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటున్న ఈవెంట్ వర్కర్(22)కు ఈ నెల 15వ తేదీన అంజి అనే వ్యక్తి ఫోన్ చేసి మాట్లాడటానికి బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్‌లో ఉన్న తన ఇంటికి రావాల్సిందిగా సూచించాడు. కొద్దిసేపట్లోనే అంజి తన భార్యతో బైక్‌పై నేరుగా హాస్టల్‌కు వచ్చి ఆమెను ఎక్కించుకొని ఇందిరానగర్‌లోని తన ఇంటికి తీసుకొచ్చాడు. రావడంతోనే బాధిత యువతిని దుర్భాషలాడాడు. అంతటితో ఆగకుండా ఆమె తల్లిని అప్రతిష్టపాలు చేసే రీతిలో మాట్లాడాడు. ఈ విషయంలోనే ఈవెంట్ వర్కర్‌కు, అంజి, ఆయన భార్య మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలోనే అంజి సదరు ఈవెంట్ వర్కర్‌పై దాడి చేశాడు. పొత్తి కడుపులో పొడిచాడు. ఆమె తప్పించుకునేందుకు యత్నించగా గది తలుపులు వేసి గడియ వేసి ఆమె ఒంటిపై ఉన్న దుస్తులు తొలగిస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తుండగా ఇందుకు ఆయన భార్య కూడా సహకరించింది. కొద్దిసేపట్లోనే వారి నుంచి తప్పించుకొని బయటికి వచ్చిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బంజారాహిల్స్ పోలీసులు అంజిపై క్రిమినల్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

19న ఉచిత ఆర్థోపెడిక్ క్యాంప్

ఖైరతాబాద్: ఆర్థోపెడిక్ సమస్యలతో బాధపడే వారికోసం ఈ నెల 19న ఉచిత ఆర్థోపెడిక్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు ఆర్థోపెడిక్ సర్జన్, రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ కుశాల్ శుక్రవారం తెలిపారు. బర్కత్‌పురా పరిధిలోని సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ క్లినిక్‌లో ఈ శిబిరం ఉంటుందన్నారు. వివరాలకు 88972 12907 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

అరుదైన వ్యాధులపై అవగాహన కల్పించాలి

సనత్‌నగర్: జన్యుపరమైన సమస్యలతో వచ్చే అరుదైన వ్యాధులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప పేర్కొన్నారు. రేర్ డిసీజెస్ డే సందర్భంగా శుక్రవారం ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెనిటిక్స్ అండ్ హాస్పిటల్స్ ఫర్ జెనిటిక్ డిసీజెస్, క్యూర్ ఎస్‌ఎంఏ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెస్ ఆడిటోరియంలో నిర్వహించిన సదస్సుకు బీరప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జన్యుపరంగా వచ్చే అరుదైన వ్యాధులపై చాలామందికి అవగాహన లేకపోవడంతో ప్రారంభ దశలో వాటిని గుర్తించలేకపోతున్నారన్నారు. దీంతో వారికి సరైన వైద్యం అందించలేకపోతున్నట్లు తెలిపారు. వైద్య విద్యార్థులకు సైతం రేర్ డిసీజెస్ పట్ల అవగాహన కల్పించేందుకు ప్రత్యేక పాఠ్యాంశాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్ విభాగాధిపతి డాక్టర్ అశ్వీందలాల్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఏడు వేలకు పైగా రేర్ డిసీజెస్ ఉన్నాయని, వాటిలో 80 శాతానికి పైగా జన్యుపరమైన సమస్యలతో వచ్చేవేనని చెప్పారు. 20 శాతం వ్యాధులకు మాత్రమే ప్రస్తుతం వైద్యం అందించగలుగుతున్నట్లు తెలిపారు. రేర్ డిసీజెస్ కలిగిన వారి కుటుంబాలకు ఈ వ్యాధుల పట్ల అవగాహన కల్పించి కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.